ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023







వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఉమ్మడి జిల్లాలో నేతల మధ్య కొనసాగుతున్న గ్రూపు తగాదాలతో అడకత్తెరలో పోకచెక్కలా తయారయ్యింది అధికారుల పరిస్థితి. ఎవరితో చెప్పుకోవాలో తెలియక కొంత మంది సెలవుపై వెలుతుండగా మరికొంత మంది, ఇద్దరి నేతల మధ్య సతమతం అవుతూనే ఉంటున్నారు. మున్సిపాల్టీ, ఇతర పాలకవర్గాల్లో వైసిపి నేతలో ఏక్కువగా ఉన్నా, వారిలో వారికి పొసగడం లేదు. దీంతో నిత్యం ఏదో రూపంలో ఒకే పార్టీ నేతలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. మున్సిపాల్టీల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.

అడకత్తెరలో అధికారులు..!





- ◆ నేతల మధ్య పోరులో నలుగుతున్న ఉద్యోగులు
- ◆ సెలవులపై వెళ్తున్న అధికారులు
- ◆ మరికొందరు బదిలీలతో స్థానం మార్పు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సిఇఒ భాస్కర్‌రెడ్డి ఇటీవల సెలవుపై వెళ్లారు. ఆయన రాజకీయపరమైన ఒత్తిళ్లతోనే సెలవుపై వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఆయన కారణాలు చెప్పకుండా మౌనంగానే ఉంటున్నారు. ఈ గోప్యత వెనుక కొన్ని శాఖపరమైన తప్పిదాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కొంత మంది నేతల ఒత్తిళ్ల మేరకు నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తప్పిదాన్ని పాలకవర్గం గుర్తించి నిలదీయడంతో ఏమి చేయాలో పాలుపోక సెలవుపై వెళ్లారన్న ప్రచారం సాగుతోంది. చెల్లింపులు జరపకుంటే ఒక సమస్య.. జరిపితే మరో సమస్య అన్న చందంగా తయారవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆయన సెలవుపై వెళ్లినట్లు అధికారవర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై ఆయన మాత్రం పెదవి విప్పడం లేదు. ఇక తాడిపత్రి పురపాలక సంఘంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా టిడిపి పాలకవర్గం ఉంది. శాసనసభ్యులు వైసిపి పార్టీకి చెందిన వారు ఉన్నారు. మున్సిపల్ ఛైర్మన్ టిడిపి, ఎమ్మెల్యే వైసిపి కావడంతో ఈ ఇద్దరి మధ్య రాజకీయ పోరు నడుస్తోంది. ముందు నుంచి కూడా జెసి.ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య రాజకీయ వైరం ఉంది. దీంతో ప్రతి విషయంలోనూ ఇద్దరి నేతల మధ్య పోటాపోటీ పోరుసాగుతోంది. ఈ నేతల ఆధిపత్య పోరుతో అక్కడ అధికారులు ఎవరూ ఎక్కువ రోజులు పనిచేయలేకపోతున్నారు. గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక బదిలీ చేయించుకుని వెళ్లారు. ఆ తరువాత వచ్చిన మరో కమిషనర్ కూడా సెలవుపై వెళ్లారు. పట్టణ అభివృద్ధికి అధికారులు సహకరించడం లేదంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఇక్కడ కూడా పనుల విషయంలో పాలకవర్గం ఒకటి చెబితే... శాసనసభ్యులు మరొకటి చెబుతారు. దీంతో ఇద్దరి మధ్య అక్కడి అధికారులు నలిగిపోతున్నారు.

సత్యసాయి జిల్లాలోనూ అదేతీరు...

సత్యసాయి జిల్లాలోనూ పలు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కన్పిస్తోంది. హిందూపురం పురపాలక సంఘంలో నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయిలో ఉంది. ఇక్కడ పురపాలక సంఘంలో సభ్యులందరూ అధికారపార్టీ నాయకులే అయినప్పటికీ వారిలోనే గ్రూపు తగాదాలున్నాయి. బాహాటంగానే ఈ రెండు గ్రూపులు కౌన్సిల్ సమావేశాల్లోనే తలపడుతున్నారు. ఈ రెండు వర్గాల ఒత్తిళ్లతో అక్కడి కమిషనర్ కూడా ఒకరు బదిలీపై వెళ్లారు. ఆ తరువాత ఒకటిన్నర నెల పాటు అక్కడికి కమిషనర్ ఎవరూ రాలేదు. తాజాగా కొత్త కమిషనర్ ఒకరు వచ్చారు. ఆయన ఎంత మేరకు అందరినీ సమన్వయం చేసుకుని నెట్టుకురాగలరో చూడాల్సి ఉంది. ఇక ధర్మవరం పురపాలక సంఘంలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఇటీవల అక్కడి కమిషనర్ సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జితో నడుస్తోంది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరం పూర్తవడంతో ఛైర్‌పర్సన్ నిర్మల తన పదవి రాజీనామా చేశారు. ఆదేసమయంలో తనకు కమిషనర్ సహకరించలదంటూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇలాంటి పరిస్థితే మరికొన్ని మున్సిపాల్టీలోనూ కొనసాగుతోంది. అధికార పార్టీనే అన్నింటా ఉన్నప్పటికీ అధికారులపై మాత్రం ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోక అధికారులు సెలవులపై కొంత మంది వెలుతుండగా, మరికొంత మంది బదిలీలు చేసుకుని బయటకు వెళ్తున్నారు. ఎన్నికలు సమీస్తున్న సమయంలో ఇటువంటి ఒత్తిళ్లు మరిన్ని పెరిగే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నడుస్తోంది.

అభివృద్ధి పనులపై

నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. కలెక్టరేట్లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డిఆర్ఒకొండయ్య సంబంధిత అధికారులు ఈ వీసీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలకు అందరికీ ఇళ్ల పథకం ద్వారా నిర్మాణాలు శరవేగంగా జరగాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా, సచివాలయ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు తప్పక చేయించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని జిల్లా అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే పగడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు స్వచ్ఛకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణ పరిహారం అందించే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవిలో ఎక్కడ నీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, సర్వే ఏడీ రామకృష్ణ, పీడీ రామాంజనేయులు, గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఏపీడీ సుదర్శన్, డిపిఒ విజయ్ కుమార్, పట్టు పరిశ్రమ అధికారిని పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పిస్తాహౌస్ ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని రుద్రం పేట బైపాస్ బెంగళూరు హైవేలో ఏర్పాటు చేసిన పిస్తాహౌస్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం పిస్తాహౌస్‌లో ఫుడ్ టేస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఫుడ్ టేస్టింగ్‌లో నగరంలోని ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు పాల్గొని ఫుడ్ టేస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పిస్తా హౌస్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మంత్రులు ఆర్‌కె.రోజా, కెవి.ఉషాశ్రీచరణ్, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారులు మహమ్మద్ అలీ, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పిస్తాహౌస్ ఛైర్మన్ మోహద్ అబ్దుల్ ఆజీద్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరజమ్మ, మేయర్ మొహమ్మద్ వసీం, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. పిస్తాహౌస్‌లో కస్టమర్లకు అనుగుణంగా బేకరీ, టీ స్నాక్స్, రెస్టారెంట్, మండీ వంటి విభాగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యత, శుచి, శుభ్రతతో ఆహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పాల్గొని పిస్తా హౌస్ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.



రెడ్డిపల్లి యల్లమ్మ దేవాలయం

పేట్రేగిపోతున్న గుప్తనిధుల వేటగాళ్లు

ధ్వంసమవుతోన్న పురాతన ఆలయాలు, కట్టడాలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో గుప్తనిధుల వేటగాళ్లు రోజు రోజుకూ పేట్రేగిపోతున్నారు. దీంతో పురాతన ఆలయాలు, కట్టడాలు ధ్వంసమవుతున్నాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న పురాతన దేవాలయాల్లో గుప్త నిధుల కోసం వేటగాళ్లు తవ్వకాలు చేపడుతున్నారు. నెల రోజుల క్రితం ఎం.కొత్తపల్లి గ్రామ సమీపంలో ఓ ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. రెడ్డిపల్లి చెరువు కట్ట కింద ఒకే చోట అతి పురాతనమైన మూడు దేవాలయాలు ఉన్నాయి. వాటిలో ఎల్లమ్మ దేవాలయంలో నాలుగు రోజుల క్రితం తవ్వకాలకు పాల్పడ్డారు. ఇందులో భాగంగా గర్భగుడిలో నాలుగైదు అడుగుల లోతు గుంత తీసి అనంతరం మట్టి వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై స్థానికులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అలాగే గుప్తనిధుల వేటగాళ్ల నుంచి పురాతన ఆలయాలు, కట్టడాలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలో తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గుంత

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే డా. తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని జమ్మలబండ గ్రామంలో గురువారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం ప్రజలు, రైతులు, మహిళల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాల్లో 80శాతం పూర్తి చేశారని, కావున ప్రతి ఒక్కరూ మరోమారు వైసిపిని ఆదరించి జగన్‌ను సీఎంను చేయాలని కోరారు. ప్రజల్లో జగన్‌కు, వైసిపికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని అలాంటి వారికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒక్కలిగల సంఘం ఛైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ నాగప్ప, ఎంపీపీ రాధమ్మ, జడ్పిటిసి భూతరాజు, సర్పంచి లక్ష్మమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రప్ప, వైస్ ఎంపీపీ రత్నమ్మ, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి శివకుమార్, వివిధ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వైసిపి నాయకులు పుట్టన్న, పాండు, ఈరన్న, తిప్పేస్వామి, గిరిధర్ నాయక్, శివరాజ్, గ్రామ వాలంటీర్లు, పాల్గొన్నారు.

7 నుంచి వేసవి వినోద క్యాంపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వేసవి వినోద సమ్మర్ క్యాంపు జయప్రదం చేయాలని క్లబ్ కన్వీనర్ నరసింహా తెలిపారు. ఈమేరకు గురువా రం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ వేసవి సెలవులు అంటేనే పిల్లలకు పండుగ లాంటిదన్నారు. అలాంటి సెలవుల్లో పిల్లలకు వినోద ంతోపాటు విజ్ఞానం వికాసాన్ని పెంపొందించేందుకు ఈ క్యాంప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకత, నైపుణ్యాన్ని, వెలికితీసే అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.కథలు, కవితలు, డ్రాయింగ్, ఆటలు, పాటలు, దేశభక్తి గీతాలతోపాటు దాదాపు 20 రకాల ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ క్యాంపునకు పంపించి బావి భారతపౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ క్యాంపు ప్రారంభోత్సవానికి ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యాండ్లూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, డాన్స్ మాస్టర్ కుళ్లాయిస్వామి, ఆఫీస్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

రాగిమేకలపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని రాగిమేకలపల్లి గ్రామంలో గురువారం టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమం నిర్వశించారు. ఈ సందర్భంగా క్లస్టర్-1 ఇన్‌ఛార్జి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఈ పాలన నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే ప్రజలు మేల్కోవాలని, ఆ సమయం కూడా ఆసన్నమైందని తెలిపారు. టిడిపి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాబాషా, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, బాబు, నాగన్న, నంజిరెడ్డి, నాగేంద్ర, నాగరాజు, హేమంత్, గోపాలరెడ్డి, చిన్ శ్రీనివాసులు, తురకలాపట్నం నాయకులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడు టిప్పూసుల్తాన్



రక్తదాతలను సన్మానిస్తున్న టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

మాతృభూమి కోసం రక్తం చిందించిన అమర వీరుడు షహీద్ టిప్పు సుల్తాన్ అని వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు టిప్పు సుల్తాన్ షహీద్ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్, మస్లీం నగరా అధ్యక్షులు ఉమర్ ఫారుఖ్ ఖాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ ఈరన్న, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ప్రభుత్వ వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్, సిడిపిఒ రెడ్డి రమణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఉమర్ ఫారూక్ ఖాన్ మాట్లాడుతు మాతృ భూమి కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుడు షహీద్ టిప్పు సుల్తాన్ అన్నారు. ఆ మహానీయుని వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని ఘనంగా సన్మానించి, వారికి జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ ఎడ్యుకేషన్ డెవలప్ మెంట్ అధ్యక్షులు ఉబెదుల్లా హుసేన్, హూమనిజం అధ్యక్షులు అజ్మతుల్లా ఖాన్, ముస్లిం మైనారిటీ నాయకులు అస్లాం, అలీబాయ్, దండోరా ఆంజనేయులు, ఆశీష్, రాజేష్, సల్తనత్ ఏ ఖుదాదాత్ అధ్యక్షులు అతీఖుర్రహమాన్, కొటిపి బసిరెడ్డి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి:సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ


డ్రైవర్లకు ప్రభుత్వ స్థలం సర్వే నంబర్-668లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు పాతి గుడిసెలు వేసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలోని ఆటో, కారు, టెంపో వాహనాల డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డిఏఓ నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రమేష్ మాట్లాడుతూ ఆటో, కారు, టెంపో వాహనాలు డ్రైవర్లు చాలా మందికి సొంతిళ్లు లేవన్నారు. దీనికి తోడు కియా పరిశ్రమ వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో ఇంటి అద్దెలు అమాంతం పెంచడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇంటి స్థలం, ఇంటి పట్టా ఇవ్వాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆటో, కారు, టెంపో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, పేద ప్రజలతో కలిసి ప్రభుత్వ భూముల్లో సిపిఎం జెండాలు పాతి గుడిసెలు వేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరి, మండల కార్యదర్శి రమేష్, తిప్పన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నాయకులు వజ్రం నాగప్ప, షరీఫ్, ఆటో యూనియన్ నాయకులు సనావుల్లా, బాబా, శ్రీకష్ణదేవరాయ కార్ల స్టాండ్ యూనియన్ నాయకులు శోభన్, రవి, ఆంజనేయులు, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.



డిఎఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అగ్రహారంలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-అమరాపురం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ సుధాకర్‌బాబు

కర్నాటకలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆంధ్ర సమీప గ్రామాల్లో సీఐ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో కర్నాటక సమీపంలోని ఆంధ్ర సరిహద్దు గ్రామాల్లో మద్యం, గుట్కా, తదితర వస్తువుల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేయడానికి కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎక్కడైనా కర్నాటక మద్యం అమ్మకాలు, మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాటు జరుగుతున్నట్లు తెలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ వెంట మడకశిర, అగలి, రొల్ల, గుడిబండ, అమరాపురం ఎస్ఐలు సుధాకర్, లావణ్య, మునిరత్నం, వెంకటేశ్వర్లు ఉన్నారు. వారు గ్రామాల్లో విస్తతంగా పరిశీలించి దుకాణాలను తనిఖీ చేయడంతో పాటు గ్రామ వీధుల గుండా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

కొత్తచెరువు : కొత్త చెరువులోని కమ్మపాలెంకొండ కింద కాలనీ, బీసీ కాలనీ, వడ్డే కాలనీలకు చెందిన వారికి శ్మశానవాటిక కేటాయించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. కమ్మపాలెం కొండ కింద కాలనీలో గురువారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఆయా కాలనీలకు శ్మశాన వాటిక లేకపోవడంతో చెరువులోనే మృతదేహాలను ఖననం చేస్తున్నారన్నారు. చెరువులో నిత్యం నీరు ఉంటున్నందున నల్ల కొండను తవ్వి రోడ్డు పక్కల మృతదేహాలను పూడుస్తున్నారని తక్షణమే స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణప్ప, శివ ప్రసాద్, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, రిటైర్డ్ టీచర్ నాగేందర్ ప్రసాద్, సైకిల్‌షాప్ బాబా, నాగమణి, శివ, లోకేష్, ఇదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి:సిఐ

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు కుల, మత ఘర్షణలకు దూరంగా ఉండాలంటూ పెనుగొండ సీఐ కరుణాకర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కుల, మతాల ఘర్షణలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామంలో నాలుగు నెలల క్రితం జరిగిన ఓ పండుగ సందర్భంగా గ్రామంలో గొడవలు జరిగాయని, దీంతో అప్పట్లో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చచెప్పి సమస్యను పరిష్కరించారన్నారు. అయితే ఓ వర్గం వారు కేసు పెట్టరు. దీంతో పరిశీలన కోసం పెనుగొండ సీఐ కరుణాకర్ రొద్దం పోలీస్ స్టేషన్లో వారితో సమావేశం ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, లోచర్ల సర్పంచి గంగాధర్, ఆ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కరుణాకర్

ప్లాస్టిక్ నిషేధం సాధ్యమేనా...?



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, తదితరులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

ప్లాస్టిక్ నిషేధం హిందూపురం పురపాలక సంఘంతో పాటు జిల్లా వ్యాప్తంగా అమలు సాధ్యమేనా..? అన్న అనుమానాలు పట్టణవాసుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా దాడులు చేసి కల్పతరువుగా మార్చుకుంటారా...? ఈసారైనా కఠినంగా వ్యవహరిస్తారా.? అన్న అనుమానాలు కూడా వ్యక్తవుతున్నాయి. ప్రపంచానికి పెనుభూతంలా మారిన ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం నుంచి హానికర ప్లాస్టిక్ తయారీ, వినియోగం ఆపేయాలని సూచిస్తూ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు హిందూపురం పురపాలక సంఘంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నా 13 పురపాలక సంఘాలతో పాటు అన్ని పంచాయతీలలో దీనిని అమలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్లు ఆయా పురపాలక సంఘాల కమిషనర్లు చెబుతున్నారు.కొన్ని సార్లు పట్టణంలోని ఆకస్మిక దాడులు చేసి, ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్నా కొన్ని రోజులకు షరా మాములుగా మారుతోంది. ఈసారైనా ప్లాస్టిక్ నిషేధాన్నిను పూర్తిస్థాయిలో అమలు చేస్తారా...? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. 16 రకాల సింగిల్ చూజ్ ప్లాస్టిక్ వస్తువులను కేంద్ర నిషేధించింది. ఇయర్ బడ్స్ నుంచి బెలూన్లు, క్యాండీ, ఐస్‌క్రీమ్ కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వాన పత్రికలు, సిగిరెట్ ప్యాకెట్లు, 100 లోపు మైక్రాన ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మల్ కోల్ వంటి 16 రకాల వస్తువులు ఉన్నాయి.

పట్టణంలో మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం : హిందూపురం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం ప్రస్తుతం హద్దులు దాటింది. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు మితిమీరి వినియోగిస్తున్నారు. వాటిని రోడ్లపై, కాలువల్లో పడేస్తుండటం వల్ల మురుగు కాలువల్లో మురుగు ముందుకు పోవడానికి ఇవి ప్రతిబంధకాలుగా మారాయి. రోడ్లపై వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో వేయడం వల్ల అవి తిన్న ఆవులు, పందులు, కుక్కల జీర్ణవ్యవస్థ పని చేయక మృతిచెందుతునానయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరణించిన జీవాల్లో 90 శాతం ఇదే కారణంగా ఉన్నట్లు పశుసంవర్థక శాఖ తేల్చింది. పెట్రో కెమికల్ ద్వారా తయారయ్యే ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు వేయడం వల్ల కార్సినోజెనిక్ అనే ఉత్పాదిక రసాయనం విడుదలై కాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికి కొంత మంది ఇడ్లీ తయారీలో సైతం దీనిని వినియోగిస్తున్నారు. భూమిలో వందేళ్లయిన కరగని ఏకైక వస్తువు ప్లాస్టిక్‌గా గుర్తించిన కొన్ని అధ్యయన సంస్థలు దీనిని పూర్తిగా నిషేధించాలని సూచిస్తున్నాయి.

జిల్లాలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
అధికారుల తూతూమంత్రపు తనిఖీలు

తనిఖీలతో సరి : పురపాలక సంఘంలో ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు పెట్టినప్పుడల్లా కొందరు అధికారులకు అవి ఆదాయ వనరులుగా మారుతున్నాయి. గతంలో రెండుసార్లు ప్లాస్టిక్‌పై నిషేధం విధించిన మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులతో కొన్ని రోజులు హడావుడి చేసి వదిలేశారు. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి.

జిల్లా మొత్తం అమలయ్యేనా....?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ప్రాంతాలలో ప్లాస్టిక్ నిషేధించాలి. ఆ మేరకు ఇచ్చిన ఆదేశాలు అమలవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు జిల్లాలో హిందూపురంతో పాటు అనంతపురం కార్పొరేషన్‌తో పాటు కొన్ని పురపాలక కమిషనర్లు ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో ఉత్తర్వులు బయటకు రావాల్సి ఉంది. ఒకేసారిగా పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తే కొంత కష్టమవుతుంది. కాబట్టి ప్రజలకు అలవాటయ్యే వరకు దశలవారీగా ఈ ప్రక్రియ చేపట్టాలని నిపుణులు చెబుతున్నారు. ఇందులో కేంద్రం సూచించిన పరిమాణం కన్నా తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ కవర్లను తయారు చేస్తున్న వారిపై దృష్టి పెట్టాల్సి ఉంది. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తిని నిలిపివేస్తేనే చాలా వరకు ప్రయోజనం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. మరి ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

నిషేధిత ప్లాస్టిక్ వాడొద్దు



భారత ప్రభుత్వం కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. వాటిని పూర్తిగా వాడకూడదు. ఒక్కసారి వినియోగించి పడేసే కవర్లపైనే మా దృష్టంతా. బహిరంగ మార్కెట్లలో ప్లాస్టిక్ వినియోగంతో పాటు ఉత్పత్తిపైన నిఘా పెడుతున్నాం. ఇందుకు ప్రజల సహకారం ముఖ్యం. పట్టణ వ్యాప్తంగా ఆకస్మిక దాడులకు బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. దశలవారీగా వార్డు సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్య వంతులను చేస్తాం. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్
మున్సిపల్ కమిషనర్

దొంగకు దేహశుద్ధి... పోలీసులకు అప్పగింత..!

హిందూపురం : పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గురువారం మహిళ మెడలో గొలుసు లాగుతున్న దుండగుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సరస్వతి అనే మహిళ ఆరు బయట ఉన్నా సమయంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన కంబదూరు మండలంసి వెంకటంపల్లి కి చెందిన మారుతీ ప్రసాద్ అనే యువకుడు మహిళా మెడలో గొలుసును లాగడానికి ప్రయత్నించాడు. అక్కడ ఉన్న స్థానికులు గుర్తించి మారుతీప్రసాద్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గోరంట్ల :మండల పరిధిలోని బుడ్డపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద గురువారం 35 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని పురుషుడి శవం లభ్యమైనట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు అతడు బ్లూ జీన్స్ ప్యాంటు, పాచి కలర్ టీ షర్టు ధరించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేపై దాడి హేయం

ధర్మవరం టౌన్ : పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ రాజకీయంగా ఎదుగుదలను చూసి కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారు ఓర్వలేక భౌతికదాడులకు దిగడం హేయమైన చర్య అని కురుబ సంఘం నాయకులు విమర్శించారు. స్థానిక కురుబ కల్యాణమండపంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో కూడా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చినప్పుడు కూడా కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారు భౌతిక దాడులకు ప్రయత్నించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో తిరిగి శంకరనారాయణపై దాడి జరిగితే జిల్లా వ్యాప్తంగా ఉన్న లక్షల మంది కురుబ కులస్తుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పాములరాజశేఖర్, జిల్లా వర్కిం గ్ ప్రసిడెంట్ చెలిమి గురుమూర్తి, కోటి వెంకటేశ్, ముసుగుమధు, దేవరసూరి, కోటిబాబు, ముసుగేశ్వరయ్య, కత్తి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కప్పలబండలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం మండల కన్వీనర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొననున్నారని చెప్పారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా సంగమేశ్వరుని కల్యాణోత్సవం

కొత్తచెరువు : కొత్తచెరువులోనిచెరువు కట్ట వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయంలో గురువారం రాత్రి సంగమేశ్వరుని కళ్యాణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు రథోత్సవ కార్యక్రమం జరగనుందని గ్రామస్తులు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : మున్సిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద జరుగుతున్న గృహ నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా వేగవంతంగా పనులను పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న సచివాలయ అమ్యూనిటి సెక్రటరీలు, వార్డు వాలంటీర్లతో మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లనిర్మాణంలో అమ్యూనిటీ సెక్రటరీలు హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. ఆప్షన్ ఒకటి, రెండు కింద నిర్మాణం జరుగుతున్న ఇళ్ల నిర్మాణలపై శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. హౌసింగ్ కింద కావాల్సినంత డబ్బు ఉందన్నారు. మెటీరియల్ అంతా అందుబాటులో ఉందన్నారు. లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పన జరుగుతోందని అన్ని రకాలుగా అనుకూల పరిస్థితి ఉన్నా, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఎందుకు తక్కువగా ఉందని ప్రశ్నించారు. ఇకపై ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి సాకులు చెప్పడానికి వీలులేదన్నారు. ఎక్కువ ఇళ్లు ఇంకా పునాదులు కూడా పడని పరిస్థితుల్లో ఉన్నాయని అన్నారు. క్షేత్రస్థాయిలో పని చేయని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఇళ్లకు వాలంటీర్లు వెళ్లి ఇల్లు ఎందుకు కట్టలేదు అనేది అడగాలన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన స్థలంలో ఇల్లు కట్టలేదంటే వారి స్థలంతో పాటు, ఇల్లు కూడా రద్దు అవుతుందన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా 6781 ఇళ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇందులో ఆప్షన్ ఒకటి, రెండు కింద 351, ఆప్షన్ మూడు కింద 5854, సొంత స్థలాలు ఉండి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు 576 మంది ఉన్నారన్నారు. ఇందులో ఆప్షన్ మూడు కింద ఇప్పటి వరకు 5713 ఇళ్ల నిర్మాణాలకు పునాది వరకు పనులు జరిగాయనిఆప్షన్ ఒకటి, రెండు కింద నిర్మాణాలు చేస్తున్నా వారు ముందుకు రావడం లేదని అన్నారు. వారి గృహ నిర్మాణాల కోసం నిధులు పుష్కలంగా ఉన్నాయని వివరించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం రూ.1.80లక్షలు ఇవ్వడంతో పాటు మెప్మా ద్వారా మరో రూ.35 వేల రుణం మంజూరు చేయిస్తామి వివరించి పనులు వేగవంతంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఈ బిల్లులు విడతల వారిగా మంజూరు చేస్తామనిదీనిపై లబ్దిదారులకు అవగాహన కల్పించి పనులు వేగవంతంగా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ప్రతి వారం పనులను పరిశీలన చేయడంతో పాటు సమీక్షలు నిర్వహిస్తామన్నారు. అందరు కలిసి అనుకున్న గడువు లోగా పనులను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఇఇ నీరజ, గృహ నిర్మాణ శాఖ ఎఇ ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి న్యూస్....

కాంగ్రెస్ అభ్యర్థిపై వ్యతిరేకత



సిపిఐ(ఎం) ప్రజాసంఘంలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు(ఫైల్ ఫొటో)

గ్రామాల్లో నిలదీతలు, అడ్డగింతలు
సిపిఎం అభ్యర్థికి పెరుగుతున్న ఆదరణ

ప్రజాశక్తి - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

బాగేపల్లి విధానసభ క్షేత్రంలో పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఎన్. సుబ్బారెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామాల్లోకి వెళుతుంటే ప్రజల నుంచి నీలదీతలు, అడ్డగింతలు ఎదురవుతున్నాయి. తమ గ్రామాలని ఏం అభివృద్ధి చేశారనితమ గ్రామంలోకి రావద్దని అడ్డగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో అబకవారిపల్లికి ప్రచారానికి వెళ్లిన ఎస్ఎన్ సుబ్బారెడ్డిని ఆ గ్రామ యువకులు అడ్డగించారు. తమ గ్రామానికి కనీసం రోడ్డు వేయని మీరు ఓటు అడగడం కోసం ఎలా వస్తారని నిలదీశారు. ఈ వీడియో కాస్తా నెట్టింటా వైరల్‌గా మారింది. వన్నంపల్లి గ్రామానికి చెందిన యువకులైతే 'మా గ్రామానికి వచ్చి పదేళ్లయిందని మా సమస్యలు చెప్పుకుంటాం ఆగండి' అని నిలదీసిన ఘటన చోటు చేసుకుంది. బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలుకాల చెరువుల నింపుకోవడం వారి కలగా మారిన నేపథ్యంలో క్రిష్ణా నికర జలాల పోరాటం సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ఉధతంగా జరుగుతున్న తరుణంలో ఓ టీవి ఇంటర్వ్యూలో సుబ్బారెడ్డి చేసిన వాఖ్యలు దుమారం రేపాయి. తమకు బెంగుళూరు లోని డ్రైయినేజీ నీరు ఇవ్వమని వాటితో చెరువులు నింపుకుంటామని ప్రాధేయపడ్డ సన్నివేశం ఎమ్మెల్యే చేతగానితనానికి అద్దం పడుతుందని పెద్ద ఎత్తున ప్రచారం అవుతోంది. 'చేతగాని ఎమ్మెల్యే మాకొద్ద'ంటూ యువకులు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. గడిచిన 25 ఏళ్లలో ఓ ఎమ్మెల్యేపై ప్రజలలో ఈ స్థాయిలో వ్యతిరేకత రావడం ఇదే తొలిసారి కావడంతో కాంగ్రెస్ పార్టీకి ఈ సారి బాగేపల్లిలో ఘోర పరాజయం తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకో వైపు తమ గ్రామాల్లో మొదలైన వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు సిపిఐ(ఎం) పార్టీ ప్రజాసంఘాలలో చేరుతున్నారు. దీంతో కాంగ్రెస్‌కు గ్రామాలకి గ్రామాలే నాయకత్వం లేని పరిస్థితికి చేరుకుంది. దీన్నిబట్టి చూస్తే బాగేపల్లి విధాన సభ క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టుకాలమే అని చెప్పవచ్చు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామ యువకుడు (ఫైల్)

నేడు మండల మీట్

నల్లమాడ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఎంపిపి సునీతా బాయ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

కదిరి టౌన్ : పౌర్ణమికి గిరిప్రదక్షిణకై అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ ట్రాఫిక్ అధికారి ఉత్తన్న ఆధ్వర్యంలో గురువారం నల్లచెరువు నుండి 2 సూపర్ లగ్జరీ, 1 ఎక్స్-ప్రెస్ బస్సులు బయలుదేరాయి. ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి, వేలాంగిణి, నాగూర్ పట్నం, చెన్నయ్, మైసూర్ తదితర విహారయాత్రలకు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. వేసవి సెలవులలో విద్యార్థులు, 40 మంది సభ్యులు వున్న ఏ గ్రామవాసులైన ఫోన్ చేస్తే ప్రత్యేక బస్సును నడుపుతామని వారు తెలిపారు. ఈప్రత్యేక బస్సులను బుక్ చేయుటలో ప్రత్యేక కృషి చేసిన ఉత్తన్నను డిపో మేనేజరు అభినందించారు. నల్లచెరువులో ప్రత్యేక బస్సులు బయలుదేరిన ఈ కార్యక్రమంలో నల్లచెరువు వాసులు దశరథరామయ్య నాయుడు, ఎంఆర్.ఆంజినప్ప, దత్త హరి, సూర్యనారాయణ, ఆర్టీసీ సిబ్బంది గంగాద్రి, మల్లేష్, ఎ.శ్రీనివాసులు, ఎస్‌పి.రెడ్డి, రమణయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి బౌద్ధుల రాక

పుట్టపర్తి అర్బన్ : బుద్ధ పౌర్ణమి సందర్భంగా పలు దేశాల బౌద్ధులు ప్రశాంతి నిలయానికి చేరుకొన్నారు. శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలలో పాల్గొనడానికి గురువారమే సింగపూర్, మలేషియా, శ్రీలంక, జపాన్, బాంగ్లాదేశ్, ఇండోనేషియా, నేపాల్ తదితర దేశాల నుంచి బౌద్ధులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. బుద్ధ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలు లో జరిగే వేడుకలలో వారు పాల్గొననున్నారు. బౌద్ధులు ప్రత్యేక ప్రార్థనలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో ఉంచి 9 కిలోమీటర్లు నిర్వహించే గిరి ప్రదర్శనలో బౌద్ధులు పాల్గొన్నారు.

కదిరిలో తిరువీధుల ఉత్సవం

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మదిన సందర్భంగా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శేషవాహనంలో శ్రీదేవి భూదేవి సమేతముగా వసంతవల్లభుల తిరుమాదవీధుల వీధుల ఉత్సవము వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పట్టెం గురు ప్రసాద్, పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఉభయ దారులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శేషవాహనంపై శ్రీవారు

గోవింద నామావళి వీడియో ఆవిష్కరణ

కదిరి టౌన్ : కదిరి లక్ష్మీ నరసింహ స్వామి వైభవాన్ని భక్తులకు మరింత చేరువ చేసేందుకు, ప్రతి ఏటా జరిగే ఉత్సవాలను, బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యతను తెలిసేలా నృసింహ జయంతి పర్వదినం పురస్కరించుకొని గోవిందనామావళి వీడియోను గురువారం విడుదల చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పట్టెం గురు ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు వసంతాచార్యులు, ఆలయ పాలక మండలి సభ్యులు శివకుమార్, అశ్వర్థ నారాయణ తదితరులు ఈ విడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా రచయిత చిన్నా రావు మాట్లాడుతూ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి నామావలిని రూపొందించాలనుకున్న తాను అర్చకులు కుమార స్వామి సహకారంతో ఈ నామావళిని రూపొందించినట్లు చెప్పారు. గోవింద నామావలిని రచించిన లిటిల్ స్కాలర్స్ స్కూల్ అధినేత చిన్నరావును, సంగీతాన్ని అందించి గానం చేసిన హైదరాబాద్ వాస్తవ్యులు పూర్ణ చంద్ర వారి బృందసభ్యులు యామిని,గాయత్రి, వీడియో ఎడిటర్ కార్తికేయ, డిజిటల్ టీమ్ కార్తిక్, చక్రిలను ఈసందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమం అనంతరం చిన్నా రావు, బత్తల ప్రసాద్, వెంకటాచలం, శేషు, లక్ష్మణ కుటాల, చక్రి, కార్తిక్, రంగనాథ్, సోము, నంది శెట్టి బాబు,యుగంధర్, తదితరులు చలపతి నాయిని సత్రాన్ని ఆధునీకరించి శ్రీ వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అందుబాటులోకి తీసుకొని వచ్చినందుకు ఆలయ చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణను, ఆలయ కార్యనిర్వాహణాధికారి పట్టెం గురుప్రసాద్‌ను సన్మానించారు.



గోవిందనామావళి విడుదలలో పాల్గొన్న ప్రముఖులు

ట్రస్ట్ సేవలు కొనసాగిస్తాం

దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు వేణుగోపాల్‌రావు

ప్రజాశక్తి - పరిగి

నాలుగు సంవత్సరాలుగా దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యా వైద్యం రంగాలలో ఇటు విద్యార్థులకు అటు వైద్యశాలలకు అవసరమైన సేవలు అందిస్తున్నామని భవిష్యత్తులో కూడా ఈ సేవలను కొనసాగిస్తామని నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామీణ ప్రాంతాల నుండి వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు ప్రతి గురువారం భోజన వసతి కల్పించి వారికి అవసరమయ్యే మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో భాగంగా వారి సౌకర్యార్థ ఐదు సీటింగ్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో ఆసుపత్రి ముందు రూ. 80వేలతో షెడ్డు ఏర్పాటు చేశామని వీటికి మరికొంత అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు స్వరూప రెడ్డి, వన్నప్ప తదితరులు పరిగి వేణుగోపాలరావుని సన్మానించి ట్రస్ట్ సేవలను కొనియాడారు.



వేణుగోపాలరావు సన్మానిస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది

సమయపాలన పాటించాలి



హాజరుపట్టికను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కొత్తచెరువు : గ్రంథాలయ శాఖాధికారులు సమయపాలన పాటించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె కొత్త చెరువు శాఖా గ్రంధాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఆనంతరం రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించడం ముఖ్యమని గ్రంథాలయ అధికారి జయరాంను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు చేపడుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇస్తున్న ఈ సుదీర్ఘ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ ఎల్ఎం. మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, పాఠకులు బసవయ్య, రామాచారి, శంకర్, సిబ్బంది వెంకటరమణప్ప, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి పరామర్శ : వైసీపీ నాయకుడు వాల్మీకి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి మోహన్ రెడ్డి వాల్మీకిశంకర్‌ను గురువారం పరామర్శించారు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొల్ల సూరి, మన్నేరి ప్రసాదు, ఎస్ రామాంజనేయులు, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ఉమా మోహన్ రెడ్డి సత్యసాయి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి గ్రంథాలయ పనితీరును పాఠకులను అడిగి తెలుసుకున్నారు. రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిస్టర్ ఉంచాలని పాఠకులకు కావలసిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయాలని గ్రంథాలయ అధికారి ఆంజనేయులును ఛైర్‌పర్సన్ ఆదేశించారు.